చీకటి చినుకులు

మరిడయ్య ఆశగా చూశాడు. అల్లంత దూరాన యిద్దరు మనుషులు గబగబా వస్తున్నారు.

ఒక ఆడమనిషి ఒక మగమనిషి.

వాళ్ళు గుండెలు అలిసిపోయేలాగ మైలు దూరంనుండి పరుగు పరుగున వస్తున్నారు.

ఆడమనిషి పచ్చచీర గావును కట్టుకుంది. ఆకుపచ్చ చీర. ఆ మనిషి చేతుల్లో ఒక మగపిల్లాడు వున్నాడు.

మగమనిషి చిన్న పంచెగుడ్డ కచ్చాపోసి కట్టుకున్నాడు. తువ్వాలుగుడ్డ ముక్కో, చీరముక్కో తలపాగా చుట్టుకున్నాడు, కాదు బుర్రకు అడ్డదిడ్డంగా చుట్టేసుకున్నాడు. బుజంమీద ఒక చినుగుల పంచపాత. నల్లగా వున్నాడు. దిమిలి పొడుగు మనిషి లాగ పొడుగ్గా పల్చగా వున్నాడు. వాళ్ల గోర్జుదాటి మట్టి రోడ్డెక్కారు.

రోడ్డు చితుకు చితుకూ మంటున్నాది. మూడు రోజులాయి చినుకులు, కురవవు, మానవు, ఈ మూడు రోజులూ, పొద్దే పొడవలేదు. కారునల్లని మబ్బులు మృత్యువు లాగ కమ్ముకొచ్చేస్తున్నాయి.

ఆడమనిషి, తన చేతుల్లో వున్న మగ పిల్లణ్ణి– మగమనిషికిచ్చింది.

మగమనిషి చుట్టపారేసి రిక్షాలోంచి దిగాడు.

సందేహంలేదు పట్నం బేరమే. ఒక రూపాయి డబ్బులు దొరికాయన్నమాట.

మరిడయ్యకు పొద్దుణ్ణించీ డబ్బులబేరం రాలేదు.

బోణీబేరం పెద్దనాయుడిది. పట్నం తీసుకెళ్లేడు, ఆ నాయుడు వీర్రాజు టాకీస్ దగ్గిర దిగిపోయాడు, దిగిపోయి జేబులోంచి వో చుట్ట తీసి మరిడయ్య కిచ్చాడు. డబ్బులన్నట్టు చూశాడు మరిడయ్య బుర్ర గోక్కుంటూను.

"తీసుకుందూగాన్లే" అన్నాడునాయుడు. అని గబగబా వెళ్లిపోయేడు.

"చిత్తం" అన్నాడు మరడయ్య. నాయుడు తప్పకుండా డబ్బులిచ్చేస్తాడు. కాని యిప్పుడు కాదు మరి.

నిన్నటి డబ్బుల్లోని పదిపైసలు మిగిలాయి. టీ తాగుదాం అనుకున్నా మరో అయిదు పైసలు కావాలి. మరో రిక్షావాణ్ణి అగ్గి పెట్టడిగి చుట్ట ముట్టించాడు. చాలాసేపు చూశాడు. బేరంలేదు. పన్నెండు గంటల వేళప్పుడు టౌన్లోంచి ఊరి చివరనున్న మిల్లుకు చిన్నబియ్యం మూట తీసుకొచ్చాడు. పావలా సంపాయించాడు. పావలా రిక్షా హేండిల్‌బార్‌కి కొట్టి ముద్దు పెట్టుకుని బనీను జేబులో పడేసుకుని బయల్దేరాడు. తిన్నగా డొనే, రావి చెట్టు జంక్షన్‌లో కొచ్చాడు. అ జంక్షన్‌లో మామూలు బస్సులన్నీ ఆగుతాయి. అక్కణ్ణించి రెండు మూడు ఊళ్లకి మట్టి రోడ్లున్నాయి. రావి చెట్టుకింద టీ కొట్టుంది, కాస్తంత దూరంలో మరోపాక వుంది. అది పెద్దనాయుడి గరుగులో వుంది. అంతకు తప్పించి ఆ చుట్టుపట్ల యిళ్లు లేవు. ఆ జంక్షన్‌కు మరిడయ్యది ఒక్కటే రిక్షా, బస్సు దిగినవాళ్లని ఆయా వూళ్లకి తీసుకువెళుతుంటాడు. ఆయావూళ్ల వాళ్లని రెండుమైళ్ల దూరంలో వున్న బస్తీకితీసుకు వెళుతుంటాడు. బస్తీకి తీసుకుపోతే మనిషికి అర్ధరూపాయి. యిద్దరయితే రూపాయి. ఒకోరోజు నాలుగయిదు రూపాయిలదాకా సంపాయిస్తాడు. ఒకోరోజు ఒట్టు పెట్టినట్టు బేరం వుండదు. చినుకులు పడుతున్న

ఈ మూడురోజులనుంచీ 'యవ్వారం' ఇలాగే వుంది. ఇవాళ మరీ 'గోరం'.

కుర్రాడి బరువు గుండెలకెగబొడుస్తుండగా ఇద్దరు మనుషులూ రావిచెట్టు సమీపించారు. ఆడది చిన్నరాగంతీస్తున్నట్టు పసికట్టాడు మరిడయ్య. అది రాగం కాదు శోకండం. ఆ కుర్రవాడికి మూడేళ్లుండొచ్చు. తోటకూరకాడలాగ వేలాడబడిపోతున్నాడు. మగమనిషి యాడవడంలేదు. మొహం అంతకంటే దారుణంగా వుంది. బెగులు బెగులుగా వున్నాయి వాళ్ల చూపులు. ఆ కుర్రవాడు అసలు చూట్టంలేదు. కళ్లు లోతుకుపోయి వున్నాయి. ఆ మొహంలో జీవకళ లేదు.

ఆ మనుష్యుల్ని పోల్చాడు. పేర్లు తెలీదు గాని వాళ్లది కొండవార వూరు.

" బాబూ కిష్ట బాబూ– నా బాబూ– వొరే" అంటున్నది తల్లి, కుర్రవాణ్ణి కదిలించి.

మగమనిషి బెగులుబెగులుగా గుండెకాయ తెగిపోయేలాగ చూస్తున్నాడు. ఏడిసినా అంతకంటె కెరిపిలావుణ్ణు అన్నట్టు చూస్తున్నాడు.

మరిడయ్యకు బోదపడిపోయింది.

పట్నంలో డాక్టరు దగ్గిరికెళ్లాలి.

ఆడమనిషి పయిటచెంగున పొట్లం కనపడింది.

మరిడయ్యకు ధైర్యం వచ్చింది. అందులో డబ్బులుండి వుంటాయి.

కుర్రవాడు చావుబతుకుల్లో వున్నాడంటే, కుండా ముంతా అమ్మీసయినాసొమ్ము పట్టుకునుంటారు.

" యేటయ్యిందేటీ" అన్నాడు మరిడయ్య, రిక్షా తారురోడ్డు మీదకుతెచ్చి.

సరిగ్గా వారం రోజులయి కిష్ణ బాబుకి జబ్బు. ఏం జబ్బు అన్నది మనకి తెలీదు. అగ్రహారంలోవున్న పంతులుగారి వైద్యం తగ్గలేదు. ముదిరిపోయింది. పట్నం తీసుకెళిపోండి అని చెప్పేసరికి కిష్ణ బాబు కాళ్లూ చేతులూ చల్లబడిపోయాయి. మెడ వేలవేసేశాడు. అగులూ బొగులూ మంటూ పొలాలకడ్డంపడి నడిచిరోడ్డు చేరుకున్నారు. అదీ కథ. ఈ నాలుగుముక్కలూ చెబుతూ ఆడది నాలుగుసార్లు చీదింది. మగమనిషి మొహంలో ఎక్కడా కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు. అతని పొట్ట వెన్నుకు అంటుకుపోయి వుంది. అతని కళ్లు ఎక్కడోలోతుకుపోయివున్నాయి ఆకళ్లలో వెతుకుదామన్నా నీళ్లు లేవు.

"బేగెక్కండి బేగెక్కండి" అన్నాడు మరిడయ్య.

గాలి చల్లగా వొళ్లు చిల్లులు పొడిచేలా వీస్తోంది.

మబ్బులు కాటుక పూసుకుని తరుముకొస్తున్నాయి, మృత్యువులాగ. పొద్దు వాలలేదు గాని రాత్రయిపోయినట్టే వుంది.

"సూడు నేస్తం, అయిదు రోడ్ల జంక్షన్‌లో సింగ్ డాక్టర్ కాడికి పోనీ" అన్నాడు రిక్షాలోంచి, మగమనిషి, బుజాన్నున్న పాతతీసి కప్పాడు కుర్రాడికి. తల్లి కుర్రాడికాళ్లూ చేతులూ తనచేతుల్తో రాస్తోంది వెచ్చదనంకోసం.

అది శీతాకాలంకాదు అది వానాకాలమూ కాదు. అది ఎండా కాలం. ఎండలు పేల్చి పేల్చి– మూడు రోజులయి మబ్బులు, వానా పట్టుకుంది. నిజానికది కొండరాళ్లు పగలవలసిన గ్రీష్మఋతువు.

ముందు రోజు మిగిలిన పదిపైసలూ బీడీలు కొనీశాడు. బియ్యంమూట మెట్టుకు తెచ్చినందుకు సంపాయించుకున్న పావలా తోటీ, మరోపావలా అరువెట్టి రావిచెట్టు కింద టీ కొట్లో ఒకరొట్టితిని టీ నీళ్లు తాగాడు. ఆ రొట్టి మూడ్రోలునాటిదే. అయితేనేంగాక అరువిచ్చింది అంతే చాలు. అసలే టీ కొట్టు పార్వతమ్మ రాకాసిది. అదిగో అల్లారొట్టికిమించి కడుపులో మరేం లేదు. అమ్మతోడు, చంపుకు తినేసినంతొట్టు. ముందురోజు మధ్యాహ్నం గుప్పెడన్నం యింతగంజీ తాగాడు. ఆ మాపులు మళ్లీ

పుత్తిగంజే. అయితే అది అతనితప్పే. పట్నంనుంచి వస్తూ వస్తూ డబుల్ జీరో మీదొక పావలా, డబుల్ సెవెన్ మీదొక అర్ధరూపాయీ బ్రాకెట్టు కట్టేశాడు. పావలా పుగాక్కాడ కోనేశాడు. రూపాయి చెల్లు, పెళ్లాం తిట్టిపోసింది. యింత పుగాకుపాయ తీసి దానిచేతిలో పెట్టాడు. అది యిన్ని గంజినీళ్లు పోస్తే తాగి కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకున్నాడు.

మరిడయ్య గబగబా రిక్షాలాగుతున్నాడు.

ఆడమనిషి అలారాగం తీస్తూనేవుంది. మరిడయ్య బొత్తిగా ఒంటి పేగు మనిషి. కష్టం వోర్చలేదు. తనుపడలేడు. మరోడు పడితే చూడలేడు. అసలు మొదట ఈ రిక్షాకూడా తొక్క లేకపోయేవాడు.

మరిడయ్యకు చిన్న సైకిలుషాపుండేది. దానికి అనుబంధంగా సోడాకొట్టుండేది. నాలుగు సైకిళ్లుండేవి. రెండుసైకిళ్లు దొంగలెత్తుకుపోయారు. ఒక సైకిలు పోలీసులు దొంగ సైకిలన్న అనుమానంతో ఎత్తుకుపోయారు. మరోసైకిలు అతనే అమ్మేశాడు. సోడాకొట్టు కొన్నాళ్లు కొడి గట్టిన దీపంలాగ సాగి సాగి చతికిలబడి పోయింది. సైకిలూ, బడ్డీ అమ్మి – నానా గడ్డీగరిచి ఈ రిక్షా కొన్నాడు. ఎనిమిదివందలకి అక్కడకది కారుచౌక. సైకిలుషాపు బాగున్నరోజుల్లో మరిడయ్య ఎర్రమ్మని ఒక మనిషి నుంచుకున్నాడు. దానికోసారి ఉంగరంకూడా చేయించిపెట్టాడు. మనిషి మాంచి పొంకంగావుండేది. దాని... సరే. ఎందుకొచ్చినగొడవ. అంతా చాలా పెద్దకతే వుంది.

పెద్దమదుంవరకూ వచ్చారు.

"నాయన్నాయన బేగెల్నీ బేగెల్నీ–" రిక్షాలో ఆడమనిషి మరిడయ్య మృత్యువునుశంకిస్తూనే వున్నాడు. గుండెల్లో నిండానీళ్లు పోసీసినట్టు బరువుగా వుంది. దుఃఖంతో బాధతో వొణుకుగా వుంది. మరిడయ్యది బొత్తిగా జాలిగుండె. అదిగదేయింతపనిచేసింది.

మరిడయ్యకు యిద్దరు కొడుకులూ ఒక కూతురూను. కూతురు, అమ్మవారు పోసి చూస్తూ చూస్తూ వుండగానే చచ్చిపోయింది. కూతురు చచ్చిపోయినరోజు జ్ఞాపకం వచ్చింది మరిడయ్యకి. ఎంత ఎర్రగా వుండేదో. బ్రతికివుంటే నేటికి పన్నెండేళ్లుణ్ణు. పోనదలా ఐందా? రెండో కొడుకును లారీ మట్టించేసింది. వాడు ఎప్పుడూ కునికిపాట్లు పడుతూనే వుండే వాడు. ఏ రోగమూ లేకపోయినా రోగిష్టిలాగా వుండేవాడు. ఎనిమిదేళ్ల వయసులో అలాగయిపోయాడు. ఆర్నెల్లు తిప్పితిప్పి వెయ్యి రూపాయిలిస్తామని– అన్ని కమీషన్లు పోనూ ఆరొందలు చేతిలో పెట్టారు. పోయిన కొడుకు ఎలాగూరాడు, ఎదవ ఆరొందలు ఎందుకు పుచ్చుకున్నావు, పారీ ఆళ్ల మొహాన్నే అన్నది పెళ్ళాం, అవున్నిజమే మరిడబ్బో! ఈనాటికి యింటి ఆడదానికి తెలీదుగాని మరాడబ్బుతోనే ఎర్రమ్మకి నీలం పొడివేసిన ఉంగరం చేయించి మాంచి చీర కొన్నాడు. తక్కిన సొమ్ముజలసాచేయిసాడు. ఇప్పుడాబోగట్టా జ్ఞాపకంవచ్చి చాలా పశ్చాత్తాపంతో ఛీఛీ - నేనేం మనిషిని అనుకున్నాడు మరిడయ్య.

"పదనాయనా - తరుముకెల్లి పోస్తంది. ఒన రొజ్జగాలొకటి" అన్నది రిక్షాలోంచి ఆడమనిషి

"నాయనా కిష్ణ బాబూ– సూడవా– నాదుక్కు సూడవా" అంటున్నాదా తల్లి హృదయవిదారకంగా.

"వల్లకోయే– యిప్పుడు కదిల్నాడుగాడా– అన్నిటికీ ఆ బగమంతుడున్నాడు. సింగు డాక్టరు సెయ్యి సలవన నయమయి పోయిందా..." అని ఆగేడు. అవ్వకపోతేనో అన్న ప్రశ్న వేసుకుందుకు ధైర్యం చాల్లేదు. మొహం దాచేసుకున్నాడు. మెడ పొడుగు కావడంవల్ల గడ్డం కానీసింది. మెడ నులిమీసిన కోడిలా వున్నాడు.

మరిడయ్య రిక్షాదిగి లాగడం ప్రారంభించాడు. అక్కణ్ణించి వూడా వాళ్ల పెట్రోలు బంకు దాకా అంతా ఎగువే. బస్తీలో దీపాలు అల్లంత దూరంలో మిల మిల లాడుతూ కనబడుతున్నాయి. వీర్రాజు

టాకీస్‌లో తొలాటకి రికార్డులు వేస్తున్నారు. సినిమాకు వెళ్లే జనం పరుగులాగ నడుస్తూ రిక్షా దాటిపోయారు. వాళ్లు సినిమా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

మరిడయ్య పెద్దకొడుకు ఒకత్తిని తీసుకుని లేచిపోయాడు. వైజాగ్‌లో వోడలరేవులో మూటలు మోసుకుంటున్నాడని, యిప్పుడు వాడి పని బాగేనే వుందని పట్నం నుంచి వచ్చిన బ్రహ్మం చెప్పాడు. యదవ యదవన్నర యదవ. తల్లినీ, తండ్రినీ సూడనోడు ఆడూ వొక్కొడుకేనా- తూ- మరిడయ్యకు కష్టం వేసింది. ఉన్నట్టుండి ఈ బ్రతుకెంతో భారంగానూ మొయ్యడం అసాధ్యంగానూ కనపడింది. ఊపిరి బిగబట్టి బరువు లాగుతున్నాడు. బస్తీలోకి రానే వచ్చాడు. అల్లా కనిపించేదే వూడావాళ్ల బంకు. వోపిక పట్టాడు గబగబా పరుగు లాగ నాలుగడుగులు లాగి గబుక్కున రిక్షాసీటెక్కి తొక్కడం ప్రారంభించాడు. అమ్మయ్య! రిక్షాలో కూచున్న మనుషులిద్దరూ చాలా బరువున్నట్టు కనిపించాదు. కాదుకారు ఆగుంటడు బరువెక్కి పోయుంటాడు. చచ్చిపోయాక మనుషు బరువెక్కిపోతారట. మరాకుర్రాడు... ఛ.... తప్పుడాలోచనలు...

సింగు డాక్టరు సెయ్యిబడితే బతీకాడా? మళ్లీ తనే వాళ్లని రావిచెట్టు జంక్షన్‌లో దిగబెట్టడా? – వాళ్లప్పుడు సంతోషించి మరో పావల్డబ్బులు పారీరా? ఇలా అలోచించుకుంటూ రిక్షా జోరుగా పోనిచ్చాడు.

కాటికలాంటి చీకటిని కరెంటు దీపాలు తరిమితరిమి కొడుతున్నాయి. అయిదు రోడ్ల జంక్షన్‌లో అంతా పట్టపగల్లా వుంది.

రిక్షా పక్కకితీసి ఆపాడు మరిడయ్య.

ఆ పక్క డాబా యిల్లే సింగు డాక్టరు ఆస్పత్రి.

సాయంత్రం ఏడుగంటల సమయం. బస్తీరోడ్లన్నీ మాంచి రద్దీగా వున్నాయి. చినుకులులేవు. ఉండీ ఉండీ ఒక్కొక్క తుంపర. ఆ చినుకుల్ని ఎవ్వరూ లెక్క చెయ్యడంలేదు.

ఇద్దరూ రిక్షా దిగేరు.

ఆడమనిషి పయిటచెంగున పొట్లం విప్పి "యిందా డబ్బులు" అన్నాది పెనిమిటితో.

" నా డబ్బులిచ్చీ" అన్నాడు మరిడయ్య.

"యిచ్చేస్తాం నాయనా– కొడుకును డాట్టరుబాబుకు సూపించనియ్యవా" అంది గట్టిగా ఏడుస్తూ ఆడమనిషి. "ఒక్క సిటం నుంచో " అని కూడా అంది.

మరిడయ్యకు మరినోరు పెగల్లేదు.

ఇద్దరూ సింగు డాక్టరు ఆస్పత్రిలోకి గబగబా తూలుతూ, దుఃఖంతో వాలిపోతూ వెళ్లారు.

మరిడయ్య రిక్షాలో కూచుని చుట్ట ముట్టించాడు. పదిహేను పైసలు– అంతే– పదిహేను పైసలుంటే చాలు టీ తాగును. ఏడీ ఎవడున్నాడు యిచ్చేదాత. మరిడయ్యకి ఏభైయ్యేళ్లు దాటాయి. మనిషి బొద్దుగా పుష్టిగా వున్నట్టు కనపడతాడు. కాని ఒట్టి ఒంటిపేగు మనిషి కష్టం వోర్చ లేదు. చూడలేదు. రోడ్డువార చచ్చిపోయిన కుక్క కనపడితే కడుపులో దేవేసినట్టయిపోయి అన్నంనోట్లో పెట్టుకోలేడా పూట. శవాన్ని చూస్తే చాలు మనసు చెదిరిపోతుంది.

మరిడయ్యకి రిక్షా లోనే కునుకుపట్టేసింది.

రాత్రి తొమ్మిది గంటలయి వుంటుంది. తొలి సినిమా వదల్లేదు.

మరిడయ్య రిక్షా పట్నంలోంచి బయలు దేరి రయ్యిరయ్యిమని రావిచెట్టు జంక్షన్ వైపు శరవేగంతో పరుగుతీస్తోంది. ఇప్పుడది బరువుగా లేదు. తేలిగ్గా వుంది. అంతా డౌను. పెద్దమదుం. దాటిందాకా పెడల్ మీద కాలు వెయ్యక్కర్లేదు.

చచ్చిపోయినవాళ్ళు బరువెక్కరు. తేలిగ్గానే వుంటారు. ఆకుర్రాడు చాలా సేపయి చచ్చిపోయాడు. సింగు డాక్టరు చాలామంచివాడు. చేతిచలవగలవాడు. కాని ప్రాణం పట్టుకురాలేడుగద! కుర్రాడితండ్రి ఇచ్చిన అయిదురూపాయలకే– మంచియింజక్షన్, కరక్టయిన యింజక్షన్ కూడా యిచ్చాడు. కాని చెయిదాటిపోయింది అంతానూ.

అడమనిషి శోకండాలకు అంతులేదు. తండ్రి ముఖం దుఃఖంతో లోతుకుపోయింది.

మరిడయ్య భయపడ్డంతా అయింది.

చంటికుర్రాడి శవంతో పట్నంలో వాళ్ళెక్కడుంటారు? మరంచేత వీళ్ళని తీసుకెళ్ళి యిల్లుజేర్చేస్తే యాడవనన్నా ఏడుస్తారు.

వాళ్ల కళ్లల్లోంచి తడి, దీపాలవెలుతురులో తళుక్కున కనిపించించి మరిడయ్యకు వాళ్లకంటె ముందు అతనికీ దుఃఖం ఆగడంలేదు.

ఒక్క నిమిషం చూశాడు.

రిక్షా ఎక్కండన్నాడు. అంతకంటే అతనేం చెయ్యిగలడు?

రిక్షా తేలిగ్గా ఎగురుతోందా అనిపిస్తోంది. డబ్బుల్లేని మనుషులు తేలిగ్గా వుండరూ? కడుపులోపేగులు చుట్టుకుపోతున్నాయి. నిండిపోయి కట్టలు తెగడానికి సిద్ధంగావున్న చెరువులావుంది మనసు.

చీకటి మృత్యువులాగ చిక్కగా వుంది.

చినుకులు రాల్తూనే వున్నాయి.

మరిడయ్య ఆకాశంవేపు చూశాడు.

ఒక్కచుక్కకూడా కనపడ్డంలేదు. లోకాన్నంతా చీకటి మింగేసినట్టు భయంకరంగా వుంది. నక్షత్రాలు మాడిపోయి చీకట్లో కలిసిపోయి వుంటాయి.

చినుకులు అలా రాల్తూనే వున్నాయి.

చీకటికరిగి చినుకులుగా పడుతున్నదా అనిపిస్తోంది.

కిష్ణ బాబు శవాన్ని పట్టుకుని రిక్షాలోంచి తల్లి ఏడుస్తూనేవుంది. ఆ ఏడుపుతో నక్కల అరుపులు లయ కలుపుతున్నాయి.

మృత్యువుకు జాలిలేదు.

మృత్యువుకు తిరుగులేదు.

చీకటి కరిగి చినుకులు రాల్తున్నాయి.

రచన : జూలై / ఆగస్టు 1977

ప్రచురణ : ఆంధ్రసచిత్ర వార పత్రిక నిర్వహించిన 77 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికయిన కథ – 24-2-1978. సంచికలో ప్రచురితం.